చేతిలో కమలం

- రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్ రాజకీయం
- కేసీఆర్ దశాబ్దకాలం అడిగినా ప్రాజెక్టులు ఇవ్వలే
- రేవంత్‌రెడ్డి ఒక్కసారి ఢిల్లీకి వెళ్లగానే మంజూరు
- ఈ ఎన్నికల్లో పైపై విమర్శలకే రేవంత్ పరిమితం
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నోరువిప్పని బీజేపీ
- మోదీపై తప్ప రాష్ట్ర ఎంపీలపై నోరెత్తని కాంగ్రెస్

కృష్ణానదిపై పెత్తనాన్ని తెలంగాణ చేతి నుంచి గుంజుకోవాలని కేంద్రం పదేండ్లుగా ప్రయత్నించింది. కేసీఆర్ ప్రభుత్వం ఒప్పుకోలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించేసింది.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు స్కైవేలు నిర్మించుకుంటామని.. కంటోన్మెంట్ భూములు ఇవ్వాలని కేసీఆర్ ప్రభుత్వం పదులసార్లు కేంద్రాన్ని విజ్ఞప్తి చేసింది. మోదీ ప్రభుత్వం ఇవ్వలేదు. కానీ, రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అంతే.. భూములను ఇవ్వడానికి కేంద్రం ఒప్పుకున్నది.

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ రాజకీయం నడుస్తున్నదా? దేశవ్యాప్తంగా కత్తులు దూసుకుంటున్న పార్టీలు.. తెలంగాణలో కరచాలనంతో కథ నడిపిస్తున్నాయా? రాజకీయ రణక్షేత్రంలో ఇరు పార్టీలు విమర్శలను వదిలేసి.. 'డూప్ ఫైట్'తో ఓటర్లను మాయ చేసే ప్రయత్నం చేస్తున్నయా? అంటే.. రాజకీయ విశ్లేషకుల నుంచి అవుననే సమాధానమే వస్తున్నది. తెలంగాణలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలను చూస్తే.. ఇవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో కొద్దిరోజులుగా సాగుతున్న 'భాయీ.. భాయీ' తరహా రాజకీయం ఓటర్లను ఆలోచనలో పడేస్తున్నది. బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో చర్చ జరగకుండా జాతీయ పార్టీలు రెండూ 'పరస్పర సహకార' పద్ధతిలో పనిచేస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సాగునీరు లేక పంటలు ఎండిపోయి, నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు కేసీఆర్ యాత్రలు చేపట్టిన సమయంలో.. కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా తీవ్ర విమర్శలు చేసుకున్నాయి. అయితే కేసీఆర్ వైపు నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రెండు పార్టీలు అలా వ్యవహరించాయన్న విమర్శలూ అప్పట్లో వ్యక్తమయ్యాయి. మోదీ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామని మోసం చేశారని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ఇవ్వలేదని, ప్రజలపై రూ.100 లక్షల కోట్ల రుణభారం మోపారని, విభజన హామీలు ఇవ్వలేదని.. ఇలా సీఎం రేవంత్ ఆ సమయంలో అనేక విమర్శలు చేశారని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర బీజేపీ నేతలు బీఆర్‌ఎస్‌ను అనుకరిస్తూ ఆఫీసుల్లో కూర్చొని రైతు దీక్షల పేరుతో డ్రామాను రక్తికట్టించారని వారు చెప్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే ఒక్క బీజేపీ నేత కూడా పొలాలకు వెళ్లి ఎండిన పంటలను ఎందుకు పరిశీలించలేదని, రైతులకు ఎందుకు భరోసా ఇవ్వలేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక మార్చి 4న ఆదిలాబాద్‌లో జరిగిన సభతో బీజేపీ-కాంగ్రెస్ బంధం బయటపడిందని, సీఎం రేవంత్‌రెడ్డి.. మోదీ 'భాయీ భాయీ' అయిపోయారని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య ఘర్షణ జరిగి అట్టుడికినా ప్రధాని ఒక్కసారి కూడా వెళ్లలేదని, రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొట్టి లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని మోదీపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి.. ఒక్కసారిగా మోదీని 'బడే భాయ్' అనడం, తెలంగాణకు గుజరాత్ మాడల్ కావాలని అనడం అప్పట్లో రాజకీయ దుమారం రేపాయి.

అనేక ఉదాహరణలు..

'నేను అడిగింది నువ్వు ఇవ్వు.. నువ్వు అడిగింది నేను ఇస్తా' (క్విడ్ ప్రో కో) అనే తరహాలో రెండు పార్టీల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.. ఇందుకు అనేక సంఘటనలను వారు ఉదహరిస్తున్నారు.

- వికారాబాద్‌లో రాడార్ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రం ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నది. అడవిని ధ్వంసం చేసి, పర్యావరణాన్ని దెబ్బతీసే ప్రాజెక్టు వద్దని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పుకోలేదు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భూములను అప్పగించేందుకు ఒప్పుకున్నది.
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేసీఆర్ ప్రభుత్వం మొదటి నుంచీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కానీ, కేంద్రం పట్టించుకోలేదు. రేవంత్‌రెడ్డి గద్దెనెక్కగానే ఏఐబీపీ పథకం కింద నిధులు మంజూరుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది.
- కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్లకు వెంటనే రిపేర్లు చేయాలని, వానకాలంనాటికి నీళ్లు నిలిపే పరిస్థితి ఉంటుందని సాగునీటి రంగ నిపుణులు పదే పదే చెప్పారు. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు, అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌పై బురద చల్లడానికి కాంగ్రెస్, బీజేపీ ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకున్నాయి. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కోరగానే కేంద్ర ప్రభుత్వం ఎన్డీఎస్‌ఏ బృందాన్ని పంపింది. విచారణ అంటూ నెలలపాటు కాలయాపన చేసింది. చివరికి.. మొదటి నుంచీ చెప్పున్నట్టుగానే కుంగిన పిల్లర్లకు రిపేర్లు చేయాలని మధ్యంతర నివేదిక ఇచ్చింది.
- రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) మంజూరు చేయాలని 2017 నుంచి కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్నది. అనేకసార్లు లేఖలు రాసింది. అయినా ఇవ్వలేదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అడగగానే మంజూరు చేసేసింది.
- కరీంనగర్, మేడ్చల్ మార్గాల్లో స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి 2015లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కంటోన్మెంట్ భూములు కావాలని ప్రతిపాదించింది. 100 ఎకరాల కంటోన్మెంట్ భూములు అప్పగిస్తే అంతకు నాలుగైదురెట్ల ప్రభుత్వ భూములు వేరే చోట ఇవ్వడానికి అంగీకరించింది. పదుల సంఖ్యలో లేఖలు, వినతులు ఇచ్చినా పట్టించుకోలేదు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి మళ్లీ అవే ప్రతిపాదనలు సమర్పించగానే రక్షణశాఖ భూములు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.
- రీజినల్ రింగ్ రోడ్ దక్షిణ భాగానికి సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం డీపీఆర్ పూర్తిచేసి, దానిని జాతీయ రహదారిగా ప్రకటించాలని అనేకసార్లు కేంద్రాన్ని కోరింది. అయినా చలనం కనిపించలేదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రతిపాదించగానే వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది.
- రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయని, అవసరాలు పెరిగాయని, దీనికి అనుగుణంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అదనంగా కేటాయించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోరినా పట్టించుకోలేదు. కానీ, రేవంత్‌రెడ్డి ఒక్కసారి విజ్ఞప్తి చేయగానే అదనంగా ఐపీఎస్‌లను కేటాయించింది.

పనిచేయని ఎత్తుగడలు.. కొత్త పన్నాగాలు

రామమందిర నిర్మాణం, ఊరూరా అక్షింతలు పంచడం వంటివి తమకు కలిసి వస్తాయని బీజేపీ భావించింది. తెలంగాణ ప్రజల్లో ఆ అంశాలపై పెద్దగా స్పందన కనిపించలేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్‌సభ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయని కాంగ్రెస్ నమ్మకంగా ఉండేది. కానీ సాగునీటి నిర్వహణ, కరెంటు కోతలు, అవినీతి, కరువు వంటివి కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెంచాయని అంటున్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్, బీజేపీ కొత్త ఎత్తుగడలు వేశాయని చెప్పున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వీడియోను మార్ఫింగ్, ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగడం, సీఎం రేవంత్‌రెడ్డి 'తెలంగాణ ఆత్మగౌరవం' నినాదం ఎత్తుకోవడం 'గుజరాత్ అహంకారం.. తెలంగాణ పౌరుషం' అంటూ ప్రచారం చేయడం ఇందులో భాగమేనని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని ప్రచారం చేయడమూ ఓ పన్నాగమేనని, తద్వారా రాష్ట్రంలోని సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని చెప్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులను ముస్లింల కోసం ఖర్చు చేస్తుందంటూ బీజేపీ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ నేతలు పెద్దగా మాట్లాడటం లేదని అంటున్నారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందంటూ పైపై విమర్శలు, రొడ్డకొట్టుడు ఆరోపణలకే పరిమితమయ్యారని చెప్తున్నారు. ఇదే సమయంలో 'మోదీ రాష్ట్రానికి గాడిద గుడ్డు' ఇచ్చాడంటూ ప్రచారం చేస్తున్న రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలోని నలుగురు బీజేపీ ఎంపీలను పల్లెత్తు మాట కూడా అనడం లేదని గుర్తు చేస్తున్నారు.

కేసీఆర్ బస్సుయాత్రతో తలకిందులు..

అధికారంలో ఉన్నాం కాబట్టి లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఎదురులేదని కాంగ్రెస్ అనుకోగా.. రాష్ట్రంలో ఖాళీ ఏర్పడిందని, దానిని తాము భర్తీ చేస్తామని బీజేపీ ఆశలు పెంచుకున్నాయి. కానీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రతో పరిస్థితి తలకిందులైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నేరుగా ప్రజల మధ్యే ఎండగడుతూ ముందుకు సాగుతున్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా కేసీఆర్ ఎక్కడికి వెళ్లినా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్నారు. కేసీఆర్ తన యాత్ర మొత్తం ప్రజా సమస్యల గురించి మాత్రమే ప్రస్తావిస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు, రైతుబంధు రాకపోవడం, ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడం, విద్యుత్తు సరఫరాలో ఆటంకాలు, కాలువలకు సాగునీటి విడుదలలో నిర్లక్ష్యం వంటి ప్రజా సమస్యలపైనే కేసీఆర్ ఫోకస్ చేశారు. ఇక ఎన్నికలకు ముందు ఇచ్చిన మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఎలా దోఖా చేసిందో ప్రజలకు వివరిస్తున్నారు. ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయాలను సైతం ఎండగడుతున్నారు. మోదీ ఇచ్చే పెద్ద పెద్ద నినాదాలు అనుకోవడానికే తప్ప.. ఆచరణలో కనిపించడం లేదని ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో ప్రజలు ఆలోచించడం మొదలు పెట్టారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యంగా తాము కాంగ్రెస్‌కు ఓటేస్తే జరిగే నష్టం ఏమిటో మైనార్టీలు ఆలోచిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో డజనుకుపైగా స్థానాల్లో బీఆర్‌ఎస్ ముందువరుసలో నిలిచిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ కలిపి మళ్లీ కొత్త నాటకాలకు సిద్ధం అవుతున్నాయని అంటున్నారు.

వీటిపై స్పందించరేం?

- పార్లమెంట్ ఎన్నికల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను విడిచిపెట్టి, బీజేపీలో చేరుతారని బలంగా ప్రచారం జరుగుతున్నది. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్వయంగా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. కానీ, రేవంత్‌రెడ్డిగానీ, కాంగ్రెస్ నేతలుగానీ ఖండించలేదు.
- గత నెలలో ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిది ఏబీవీపీ నేపథ్యమని, రేవంత్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్నానని చెప్పారు. కాంగ్రెస్ స్పందించలేదన్నారు.
- ఇటీవల తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై కరీంనగర్‌లో ప్రచారం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని బడేభాయ్ అంటూ అభివర్ణించారని, గుజరాత్ తరహాలో తెలంగాణను తీర్చిదిద్దుతామని అన్నారని గుర్తు చేశారు. ఎన్నికల వేళ రేవంత్ గాడిదగుడ్డు పట్టుకొని ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలు చెప్పేవారని గాడిదపై కూర్చోబెడతామన్నారు. కాంగ్రెస్ సమాధానం ఇవ్వలేదు.
- తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటున్నది. కానీ.. బీజేపీ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు.
- రాష్ట్రంలో ఎండిపోయిన పంటలను బీజేపీ నేతలు ఇప్పటివరకు పరిశీలించలేదని, సాగునీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయలేదని గుర్తు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ నల్లగొండకు వెళ్లి ప్రజలపై, నేతలపై రాళ్ల దాడులు చేసి నానాయాగీ చేసిన బీజేపీ నేతలు.. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఆటోకార్మికుల ఆత్మహత్యలపై నా మాట్లాడలేదన్నారు.

ఎప్‌సెట్‌లో 94.4% హాజరు

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం గురువారం ప్రారంభమైన తొలి రోజు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగానికి (తెలంగాణ, ఏపీ కలిపి) 94.4శాతం విద్యార్థులు హాజరైనట్టు కన్వీనర్ డాక్టర్ డీన్‌కుమార్ తెలిపారు. తొలి రోజు ఇంజినీరింగ్ పరీక్షలకు 96,228మంది హాజరైనట్టు అధికారులు పేర్కొన్నారు.

యూఎస్ కాన్సులేట్ 'విజువల్ ఆర్ట్ కాంపిటీషన్'

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): భారత్- అమెరికా మధ్య అంతరిక్ష సంబంధాలపై 'విజువల్ ఆర్ట్ కాంపిటీషన్' నిర్వహిస్తున్నట్టు అమెరికా కాన్సులేట్ తెలిపింది. సృజనాత్మక చిత్రాలను ఈ నెల 27లోగా తమకు పంపాలని కోరింది. విజేతలను అమెరికా స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేక అతిథులుగా ఆహ్వానిస్తామని పేర్కొన్నది.

అకౌంట్స్ ఆఫీసర్స్‌కు వైద్య పరీక్షలు

హైదరాబాద్, మే 9(నమస్తే తెలంగాణ): మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో అకౌంట్స్ ఆఫీసర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్, వైద్యారోగ్య శాఖలోని ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వైద్య పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ జారీ చేశారు. వైద్య పరీక్షలకు పిలిచిన అభ్యర్థులు తప్పకుండా షెడ్యూల్ ప్రకారం హాజరు కావాల్సి ఉంటుందని టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

సామాన్యుడి నేల విమానం సమాధి

- కేంద్రం నిర్వాకంతో ప్రైవేటు చేతుల్లోకి రైలుబండి
- వచ్చే నెల 4న కేరళలో తొలి ప్రైవేటు రైలు షురూ
- లాభాలు వచ్చే రూట్లలో మరో 151 ప్రైవేట్ రైళ్లు
- ఇదే జరిగితే సామాన్యులపై చార్జీల భారం తప్పదు
- ఇప్పటికే రైల్వే భూములను లీజుకిచ్చిన కేంద్రం
- సీనియర్ సిటిజన్లకు టికెట్ రాయితీలోనూ కోత

రైల్వే స్టేషన్‌లో చాయ్ అమ్ముకున్నానని చెప్పుకొనే ప్రధాని నరేంద్ర మోదీ పేదల నేల విమానాన్ని సమాధి చేస్తున్నారు. పేదోడి రైలు బండి పెద్దోళ్ల జేబుల్లోకి వెళ్తున్నది. కోట్లాదిమంది సామాన్యుల ప్రయాణ సాధనం.. కొద్దిమంది లాభార్జన వస్తువుగా మారుతున్నది. రైల్వే ప్రైవేటీకరణ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదోడి బతుకుపై చావు దెబ్బ కొడుతున్నది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): భారత జాతి సొత్తుగా ఇప్పటివరకూ చెప్పుకొంటున్న సామాన్యుడి రైలు.. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. వచ్చే నెల 4న కేరళలో తొలి ప్రైవేటు రైలు కూత పెట్టనున్నది. ఐదేండ్ల కిందట ఐఆర్‌సీటీసీ తొలిసారిగా ఢిల్లీ-తేజస్ రైలును నడుపగా, ఇప్పుడు ఏకంగా పూర్తి ప్రైవేట్ భాగస్వామ్యంతో రైలు ప్రయాణం సాగనున్నది.

పదేండ్ల నుంచి కుట్రలు

2014లో కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రైల్వేలను ప్రైవేటుపరం చేసే కుట్రలు మొదలయ్యాయి. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1924లో మొదలైన రైల్వే బడ్జెట్ ప్రస్థానానికి 2016లో మంగళం పాడిన మోదీ ప్రభుత్వం.. అనంతరం రైల్వేను

ప్రైవేటుపరం చేయడానికి వ్యూహాలు రచించింది. దేశంలోని 109 మార్గాల్లో 151 ప్రైవేటు రైళ్లు నడుపడానికి ప్రైవేటు సంస్థలకు 2020 జూలై 1న ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మార్గాలన్నీ లాభాల్లో ఉన్నవే కావడం గమనార్హం.

ప్రయాణం ఇకపై భారమే

సాధారణంగా రైళ్లలో ప్రయాణించేది పేదలు, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులే. వీరిలో చాలామంది తమవెంట తమ సంతానాన్ని, లగేజీలను తీసుకువెళ్తుంటారు. ప్రస్తుతం ఈ లగేజీలకు, చిన్నారులకు టికెట్లు తీసుకోకపోయినా.. ప్రయాణానికి అనుమతి ఉన్నది. అయితే, కేంద్రం ప్రైవేటుకు కట్టబెట్టిన 109 మార్గాల్లో ప్రయాణించే ప్రైవేటు రైళ్లలో వీటిని అనుమతిస్తారా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. పైగా ఈ రైళ్లలో టికెట్ రేట్లు, ఆహారం ఇలా అన్ని రుసుములను ప్రైవేటు వ్యక్తులే నిర్ణయించనున్నారు. దీంతో సామాన్యులకు రానున్న రోజుల్లో రైలు ప్రయాణం ఖరీదుగా మారే ప్రమాదమున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రైల్వే భూములు లీజుకు..

రైళ్లను ప్రైవేటుపరంచేయడమే కాదు రైల్వే ఆస్తులను, ముఖ్యంగా భూములను కూడా 35 ఏండ్లపాటు లీజుకు ఇచ్చి తద్వారా వచ్చిన సొమ్మును ఖజానాలో నింపుకొన్నది బీజేపీ సర్కారు. ఈ మేరకు 2022లో కేంద్ర క్యాబినెట్ దీనికి ఆమోద ముద్ర వేసింది. ఇక, వృద్ధులకు రైల్వే టికెట్లపై ఇస్తున్న రాయితీని కరోనా సంక్షోభంలో ఎత్తేసిన ప్రభుత్వం ఇంకా దాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించలేదు. తక్కువ ఛార్జీలున్న ప్యాసింజర్ రైళ్ల స్థానంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను తీసుకొచ్చి పేదోడి జేబుకి చిల్లు పడేలా చేసింది. ఇప్పుడు ఏకంగా రైలును ప్రైవేటుకే అప్పగించింది. దీంతో భవిష్యత్తులో సామాన్యుడికి రైలు ఎక్కడమే గగనమయ్యే దుస్థితిని తీసుకొచ్చింది.

సంతకాలు తీసుకుని రేప్ కేసు పెట్టించారు!

- నాపై లైంగికదాడి జరగలేదు
- ఫిర్యాదు వెనక్కు తీసుకున్న మహిళ
- 'సందేశ్‌ఖాలీ' కేసులో కీలక మలుపు
- ప్రతిపక్ష నేత సువేందు ఆదేశాలతోనే మహిళలతో ఫిర్యాదు చేయించాం
- బీజేపీ స్థానిక నేత వీడియో వైరల్
- సువేందుపై చర్యలు తీసుకోవాలి
- ఈసీకి తృణమూల్ కాంగ్రెస్ ఫిర్యాదు

కోల్‌కతా, మే 9:లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ ఘటన వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఈ ఘటనలో ఇప్పటివరకు లైంగికదాడికి గురైన బాధితురాలిగా చెప్తున్న ఓ మహిళ తన ఫిర్యాదు వెనక్కు తీసుకున్నారు. ఈ మేరకు తన అత్తతో కలిసి ఆమె బుధవారం మెజిస్ట్రేట్ ముందు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... జాతీయ మహిళా కమిషన్ తమ ప్రాంతానికి వచ్చిన రోజు పియాలి దాస్, మంపి దాస్ అనే మహిళలు తమ వద్దకు వచ్చి ఫిర్యాదు చేయడానికి రావాలని చెప్పి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలిపారు. 'మాకు ఉపాధి హామీ పథకం డబ్బులు మాత్రమే రావాలని, ఆ డబ్బులు మాకు వస్తే చాలు, ఇంకా ఏం ఫిర్యాదులు లేవని పియాలికి చెప్పాం. పియాలి మాతో ఖాళీ కాగితంపై సంతకం చేయించుకుంది. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ లీడర్లు రేప్ చేశారని చెప్తున్న బాధిత మహిళల జాబితాలో నా పేరు, మా అత్త పేరు కూడా ఉన్నాయని ఆ తర్వాత తెలిసింది. మాపై ఎలాంటి అఘాయిత్యం జరగలేదు. ఈ ఆరోపణలు అబద్ధం' అని సదరు మహిళ పేర్కొన్నారు. పియాలి బీజేపీకి చెందిన వ్యక్తి అని తమకు తర్వాత తెలిసిందని తెలిపారు. ఆమెకు సందేశ్‌ఖాలీలో ప్రతి ఒక్కరిపై సమాచారం ఉందని, అబద్ధాలు చెప్పి తమను ట్రాప్ చేసినందుకు పియాలిని శిక్షించాలని వారు పేర్కొన్నారు. తాము ఇప్పుడు బయటకు వచ్చి పియాలికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

బీజేపీ నేత స్టింగ్ ఆపరేషన్ వీడియో వైరల్

ఇదే ఘటనకు సంబంధించి మరో వీడియో వైరల్‌గా మారింది. సందేశ్‌ఖాలీలో ఎలాంటి లైంగిక దాడులు జరగలేదని, సువేందు అధికారి ఆదేశాలతో ఫిర్యాదు చేసేలా మహిళలను ఒప్పించినట్టుగా సందేశ్‌ఖాలీ మండల బీజేపీ అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న గంగాధర్ కోయల్ ఒప్పుకుంటున్నట్టుగా ఈ వీడియోలో ఉంది. ఓ న్యూస్ ఛానల్ స్టింగ్ ఆపరేషన్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని తృణమూల్ కాంగ్రెస్ చెప్తుండగా, ఈ వీడియోలో వాయిస్ ఎడిట్ చేశారని గంగాధర్ చెప్పుకొచ్చారు.

ఎన్నికల సంఘానికి తృణమూల్ ఫిర్యాదు

సందేశ్‌ఖాలీ ఘటనకు సంబంధించిన ఆరోపణలు కేవలం కల్పితమని, ఈ కుట్ర వేనుక సువేందు అధికారి ఉన్నారని ఆరోపిస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోస్ గురువారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కుట్ర వెనుక ఉన్న సువేందు అధికారి, ఇతర బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ ఇలాంటి తప్పుడు కథలను అల్లిందని, బీజేపీకి వ్యతిరేకంగా బయటకు వచ్చి మాట్లాడిన మహిళను ఆ పార్టీ నేతలు బెదిరిస్తున్నారని తృణమూల్ ఎంపీ సుష్మిత దేవ్ ఆరోపించారు. మరోవైపు, కేవలం నష్టనివారణ కోసం మాత్రమే తృణమూల్ కాంగ్రెస్ బీజేపీపై ఆరోపణలు చేస్తున్నదని బీజేపీ అధికార ప్రతినిధి ప్రియాంక తిబ్రేవాల్ ఆరోపించారు.

క్రిశాంక్ బెయిల్‌పై నేడు వాదనలు

నాంపల్లి కోర్టులు, మే 9 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ బెయిల్ పిటిషన్‌పై మరోసారి వాదనలు వినిపించాలని ఇన్‌చార్జి కోర్టుగా కొనసాగుతున్న 8వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 7వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో వాదనలు పూర్తయ్యాయని, తీర్పును వెల్లడించాలని నిందితుడి తరపు న్యాయవాది కోరినప్పటికీ వాదనల కోసం వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. బీఆర్‌ఎస్ సోషల్ మీడియాకు క్రిశాంక్ పాత్ర చాలా ముఖ్యమని, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. మరోసారి వాదనల విన్న తర్వాత ఉత్తర్వులు జారీ చేస్తుందని కోర్టు తెలిపింది. ఎన్నికల సమయంలో క్రిశాంక్ బయటికి రాకుండా చేసేందుకే ప్రభుత్వం యోచిస్తున్నదని నిందితుడి తరపు న్యాయవాదులు కోర్టు బయట ఆగ్రహం వ్యక్తం చేశారు.

50.54% ఫిట్‌మెంట్ చెల్లించండి: తపస్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయులకు 50.54% ఫిట్‌మెంట్‌తో జూలై 2023 నుంచి వేతన సవరణ చేయాలని పీఆర్సీ కమిటీని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) విజ్ఞప్తి చేసింది. గురువారం సంఘం సభ్యులు పీఆర్సీ కమిటీని కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జనవరి 1 నాటికి ఉన్న డీఏ 33.67 శాతం కలుపుకొని 50.54 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. కనీస వేతనం రూ.35,000 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వార్షిక వేతన వృద్ధి రేటు 3 శాతం నుంచి 3.5 శాతంగా ఉండాలని కమిటీ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఉన్న మాస్టర్ స్కేల్‌ను కొనసాగించాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ క్యాడర్ ఉపాధ్యాయ వేతన వ్యత్యాసం 1:1.363 నుంచి 1:1.15గా తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న వివిధ క్యాటగిరీలకు చెందిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే ప్రతిపాదనలు పంపుతూ.. మినిమం టైం స్కేల్‌ను ప్రకటించాలని కోరారు. ఏఏఎస్ నుంచి 6, 12, 18, 24 కాకుండా 4, 8, 12, 16గా ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఆర్‌ఏ స్లాబ్‌లు 30 శాతం, 25 శాతం, 20 శాతంగా మార్చాలని చెప్పారు. ఉద్యోగి చనిపోతే అంత్యక్రియల ఖర్చులు రూ.50 వేలకు పెంచాలని కోరారు. సమావేశంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, రాష్ట్రకోర్ కమిటీ సభ్యులు పాలేటీ వెంకట్రావ్, సూరం విష్ణు వర్ధన్‌రెడ్డి, భాస్కర్‌దేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడిని.. ప్రజలకు సేవకుడిని!

పదవి లేకున్నా పాతికేండ్లుగా ప్రజాసేవ

- మధుర ట్రస్టు ద్వారా వైద్యసేవలు
- విద్యార్థులకు నైపుణ్య శిక్షణా తరగతులు
- ఇక్కడ కాంగ్రెస్ పార్టీ పోటీయే కాదు
- మల్కాజిగిరి లోక్‌సభపై గులాబీ జెండా ఎగురవేస్తాం
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మేడ్చల్, మే7(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి లోక్‌సభ పరిధి స్థానికుడిని.. 25యేండ్లుగా ఏ పదవి లేకున్నా ప్రజలకు సేవ చేస్తున్నానని మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరూ స్థానికేతరులేనని ఆయన ఆరోపించారు. వారంటీలేని కాంగ్రెస్, హైదరాబాద్ నగర అభివృద్ధికి పైసా కేటాయించని బీజేపీ అభ్యర్థులను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నాని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధిని చూసి, మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో గులాబీ జెండా ఎగుర వేయాలని ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారంటున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ..

మీకు ప్రధానంగా ఏ పార్టీతో పోటీ ఉంది ?

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పోటీయే కాదు. అధికార పార్టీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పథకాల అమలులో పూర్తిగా విఫలమైంది. ఐదు నెలల కాలంలోనే విద్యుత్, నీటి సమస్యలను ప్రజలు ఎదుర్కోవాల్సిన దుస్థితి వచ్చింది. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు విశ్వాసం కోల్పోయారు. అందుకే బీఆర్‌ఎస్‌కు నామమాత్రంగా బీజేపీ పోటీ ఇస్తుందని భావిస్తున్నాం.

మీ గెలుపుపై ధీమా ఏమిటి ?

పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధే మా ధీమా. ప్రపంచ దేశాలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయి. ఈ ఘనత కేసీఆర్ నాయకత్వం వల్లే సాధ్యమైంది. మహానగరంలో రోడ్లు, తాగునీటి, విద్యుత్ సమస్యలు లేకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగింది. ఐటీ కంపెనీలు, వేలాది పరిశ్రమలు ఏర్పడ్డాయి. హైదరాబాద్ నగరం ఉద్యోగాలకు కేంద్రంగా మారింది. ఈ విషయాన్ని హైదరాబాద్ నగరవాసులు గుర్తించారు. అందుకే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకోవాలని చూస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఆరుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉండటం మా విజయానికి కలిసి వస్తున్నది.

ప్రచారానికి స్పందన ఎలా ఉంది ?

బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నది. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి ఓ మినీ ఇండియా. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తారు. బీఆర్‌ఎస్ పదేండ్ల కాలంలో కుల, మత పంచాయితీలు లేవు. కేసీఆర్ పాలనను చూసిన ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడే నివాసం ఏర్పరుచుకుని బీఆర్‌ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతమనే కుట్రలను బీఆర్‌ఎస్సే బద్దలుకొడుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. అందుకే మమ్మల్ని ఆదరిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిట్టింగ్ ఎంపీ సీటు మల్కాజిగిరిలో అభివృద్ధి జరిగిందా ?

మల్కాజిగిరి పార్లమెంట్ రేవంత్‌రెడ్డికి రాజకీయంగా పునర్జన్మను ఇచ్చింది. కొడంగల్ ప్రజలు ఎమ్మెల్యేగా ఓడిస్తే మల్కాజిగిరి ప్రజలు రాజకీయ భిక్ష ఇచ్చారు. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కనీసం ఎంపీ కోటా నిధులను కూడా ఖర్చు చేయలేదు. దీంతో కోటా నిధులన్నీ వెనక్కి వెళ్లిపోయాయి. ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా రేవంత్‌రెడ్డి మల్కాజిగిరికి ఏమీ చేయలేదు. పైగా ఇక్కడ కనీసం ఓటు హక్కు కూడా లేని అభ్యర్థిని బరిలో నిలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదవులు అనుభవించిన మహేందర్‌రెడ్డి కుటుంబానికి ప్రజలే బుద్ధి చెబుతారు.

ప్రజాప్రతినిధిగా లేకున్నా ఎలాంటి సేవలు చేశారు ?

ప్రజాప్రతినిధిగా లేకున్నా 25 యేండ్లుగా ప్రజలకు అందుబాటులో ఉన్నాను. ఆపదలో తోడైయ్యాను. మధుర ట్రస్టు ద్వారా వేలాది మందికి వైద్య సేవలు అందించాము. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వేలాది మందికి శిక్షణ ఇప్పించాను. కరోనా సమయంలో నేను ఐసీయూలో ఉన్నా.. సేవలు అందించినందున ప్రజలు నన్ను గుర్తుంచుకున్నారు. నేను ప్రజల తరపున ఫైటర్‌ని. ప్రజల దీవేనతో కేసీఆర్ ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో విజయం సాధిస్తాననే ధీమా ఉంది.

మీరు గెలిస్తే మల్కాజిగిరి అభివృద్ధి ఎలా చేస్తారు ?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ఒక్కసారైనా పార్లమెంట్‌లో ఇక్కడి సమస్యలను ప్రస్తావించలేదు. నేను ఎంపీగా గెలిస్తే ప్రజలకు అవసరమైన అన్ని పనులు చేయిస్తాను. ఉప్పల్ కారిడార్‌తో పాటు ఇటీవలె మంజూరైన సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ కారిడార్ పనులు త్వరగా పూర్తి చేయిస్తా. ఆర్మీ ప్రాంతాలలో అనేక సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. దానిపైనా దృష్టి సారిస్తా. ఎంఎంటీఎస్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ల లింక్ రోడ్ల నిర్మాణాలు చేయిస్తాను.